సాక్షి
మహబూబాబాద్

మంగళవారం | 29 | ఆగస్టు | 2023



బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం

ములుగు గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేద్దామని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు.

- 8లో



మేడారం హుండీల లెక్కింపు

మేడారం సమ్మక్క, సారలమ్మల హుండీల కానుకలను ఎండోమెంట్ కార్యాలయంలో లెక్కించారు. రూ.52.98లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.0°/24.6°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో ఆ ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



గూడూరు: హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఎదుట సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ, మన ఊరు–మన బడి పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో కనీసం పాఠశాలల్లో బాలికలకు అవసరమైన బాత్‌రూంలు కట్టలేని పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

భయందోళనలో విద్యార్థినులు

మరిపెడ: గుర్తుతెలియని వ్యక్తి హాస్టల్‌లోకి ప్రవేశించాడని గమనించిన విద్యార్థినులు ఆందోళనకు గురైన ఘటన మరిపెడ మున్సిపాలిటీలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో జరిగింది. ఇందిరానగర్ కాలనీలోని బాలికల హాస్టల్‌లో సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించినట్లు విద్యార్థినులు గమనించి భయందోళనకు గురయ్యారు. వెంటనే ప్రిన్సిపాల్ సునీతకు సమాచారం అందించడంతో ఆమె చేరుకొని పరిసరాలు పరిశీలించారు. ఎవరు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థినులకు ఆమె ధైర్యం చెప్పారు. అనంతరం హాస్టల్ వద్ద పోలీస్ గస్తీ పెంచాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

'ఉన్నతి' శిక్షణను విజయవంతం చేయాలి




మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉన్నతి శిక్షణను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం రిసోర్స్ పర్సన్‌లతో ఏర్పాటు చేసిన సమావేశానికి డీఈఓ హాజరై మాట్లాడారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉదయం 9.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల, బాలుర పాఠశాల మహబూబాబాద్, జెడ్పీహెచ్ఎస్ తొర్రూరు, మాటేడులో శిక్షణ నిర్వహిస్తామన్నారు. శిక్షణకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్, కేజీబీవీ, యూపీఎస్ స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్‌లు, హైస్కూల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎస్జీటీలు శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



గూడూరు: ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. మండలంలోని అయోధ్యపురం,గూడూరు హైస్కూళ్లలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, మండల వెంకటేశ్వర్లు, భిక్షపతి, చింత బాలయ్య, రాముడు, నామాల్వార్, కృష్ణమూర్తి, రవిచంద్ర, గోపినాథ్ పాల్గొన్నారు.

ఎస్‌సీఐసీపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్



తొర్రూరు: వినియోగదారుల సమాచార కేంద్రం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణ వాసి వింజమూరి సుధాకర్ ఎన్నికయ్యారు. తాజాగా నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించారు. ఆయన ప్రస్తుతం వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని డీసీఐసీలకు ప్రత్యేక భవనం, కార్యాలయ సిబ్బందిని నియమించాలని సుధాకర్ కోరారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్పీ పొలిటికల్ బదిలీ



బదిలీపై వెళ్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

అత్తమీద కోపం.. అల్లుడిపై ప్రతాపం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఎఫెక్ట్..!
- జిల్లాలో పలు రకాలుగా చర్చ
- ప్రాధాన్యత లేని పోస్టులో నియామకం
- నూతన ఎస్పీగా చంద్రమోహన్

సాక్షి, మహబూబాబాద్: జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్‌ను రాష్ట్ర పోలీస్ అకాడమికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలోని మల్టీ ఏజెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో ఎస్పీగా పనిచేస్తున్న చంద్రమోహన్‌ను బదిలీపై జిల్లాకు పంపారు. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆకస్మిక బదిలీపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారం జరుగుతోంది. 2021 డిసెంబర్ 26న జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు ఏరికోరి తెచ్చుకున్న ఎస్పీ.. ఎన్నికల వరకు ఉంటారని అందరూ భావించారు. అయితే ఎవరు ఊహించని విధంగా 20 నెలల్లో బదిలీ కావడం.. దీని వెనుక ఏం జరిగింది అనేది అటు అధికారులు.. ఇటు రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.

ఆకస్మిక బదిలీతో షాక్..

జిల్లా పోలీస్‌బాస్ ఆకస్మిక బదిలీతో ఆశాఖ అధికారులు విస్మయానికి గురయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేశారు. అప్పుడు జిల్లా ఎస్పీని బదిలీ చేయలేదు. దీంతో ఆయన ఎన్నికల వరకు ఉంటారని అందరు భావించారు. అయితే కుటుంబ సభ్యుల్లో జరిగిన రాజకీయ పరిణామాలే ఆయన బదిలీకి కారణం అని కొందరు చెబుతుండగా.. ఎస్పీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాఖ తీసుకున్న నిర్ణయం అని మరికొందరు చెబుతున్నారు. కుటుంబ రాజకీయ పరిణామాలే కారణమైతే ఎస్పీ బదిలీతోనే ఆగిపోతుంది.

అలా కాకుంటే ఎస్పీతో పాటు మరికొందరిపై బదిలీ వేటు పడే అవకాశం ఉందని పలువురు సీనియర్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఎస్పీ బదిలీ వార్తతో ఆయనకు అనుకూలంగా ఉండే అధికారులు మాత్రం ఆందోళనగానే ఉన్నట్లు సమాచారం.

ఆ కోపమేనా..?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ తన బిడ్డను ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. కాగా అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ఆమెకు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వడం లేదు. ఇటీవల విడుదల చేసిన జాబితాలో కూడా ఆమె పేరు లేదు. దీంతో ఆమె మనస్తాపం చెందిగా.. భర్త శ్యాం నాయక్ ఉద్యోగం వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు నేడో రేపో రేఖానాయక్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆమె పార్టీ మారకుండా ఉండేందుకు పలువురు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. అయినా చర్చలు ఫలించలేదు. దీంతో రేఖానాయక్‌పై కోపంతో ఆమె అల్లుడు ఎస్పీ శరత్ చంద్రపవార్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేసినట్లు మానుకోటలో ప్రచారం జరుగుతోంది.

కొత్త ఎస్పీకి సవాలే..



నూతన ఎస్పీ చంద్రమోహన్

జిల్లాలో ఎస్పీగా పని చేయడం కత్తిమీద సాములాంటింది. గుడుంబా, నల్ల బెల్లం, గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనిని అదుపు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తే అర క్షణంలోనే నాయకుల నుంచి ఫోన్లు దీంతో ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లు ఉంటుంది. అదే విధంగా పీడీఎస్ బియ్యం, పేకాట క్లబ్‌లు కూడా పలువురు రాజకీయ నాయకుల అనుచరుల కనుసన్నల్లో సాగుతాయని ప్రచారం. వీటిని కట్టడి చేసేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వీటితో పాటు మహబూబాబాద్ పట్టణంలో భూముల ఆక్రమణ, భూముల పంచాయితీ తలనొప్పిగా ఉంటుంది. వీటిని ఎదుర్కోవడం నూతన ఎస్పీ చంద్రమోహన్ ముందున్న సవాళ్లు.

పెండింగ్ వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక
- ప్రజావాణిలో 110 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: పెండింగ్ వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి వినతులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమన్నారు. 110 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కొన్ని వినతులు పరిశీలిస్తే..

జీఓ 59వల్ల పేదలపై భారం పడుతుందని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి ఇచ్చారు. కేసముద్రం మండలం అన్నారం గ్రామానికి చెందిన సుగుణమ్మ వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని వినతిపత్రం అందజేసింది. పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన రాంపాక వెంకటయ్య కుడికాలును అనారోగ్య సమస్యతో తొలగించగా.. అతడి భార్య నిర్మలతో పాటు కుమారుడు యాకయ్య ఆయనను కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. కాగా తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. కాగా వెంకటయ్యను తన కుమారుడు యాకయ్యతో పాటు ఆటోడ్రైవర్ ఎత్తుకుని కలెక్టరేట్‌లోకి తీసుకొచ్చారు.



వెంకటయ్యను ఎత్తుకుని వెళ్తున్న కుమారుడు..

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న చైర్మన్ నవీన్

మరిపెడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు దళిత బంధు పథకం అందజేసి, వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మండలం తానం చర్ల, గిరిపురం, గుండెపుడి, తాళ్లఊకల్ తదితర గ్రామాల్లోని దళిత కాలనీలో ఆయన పర్యటించి దళితబంధు పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న దళితబంధు నిధులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గుగులోతు రాంబాబు, రవీందర్‌నాయక్, బివిఆర్ ఎస్ శాస్త్రి, సర్పంచులు శ్వేత, జనార్దన్, ఉపసర్పంచ్ సుమలత–సరేష్, పట్ల మల్లయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

కురవి: పదేళ్లలో పేదలకు గుంట భూమి ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రం శివారులో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను సందర్శించారు. గుడిసెల కాలనీలో సీపీఐ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల జిమ్మిక్కులతో గృహలక్ష్మి, దళితబంధు, బీసీ రుణాల పేరిట ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమవుతున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు మంజూరు చేస్తున్నారని, నిరుపేదలకు మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. పేదలకు జాగాలు దక్కే వరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బూర్గుల కృష్ణ, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, అప్పాల వెంకన్న పాల్గొన్నారు.

'ఆరోగ్య శ్రీ'తో పేదలకు మెరుగైన వైద్యం

పెద్దవంగర: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అన్నారు. చైర్మన్‌గా నియమితులైన తర్వాత సోమవారం ఆయన మొదటిసారి సొంత గ్రామమైన వడ్డేకొత్తపల్లికి రాగా.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు నియోజకవర్గ, మండల నాయకులు, గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడారు, సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆరోగ్యశ్రీ ట్రస్టును బలోపేతం చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ తనను గుర్తించి పదవిని అప్పగించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్య శ్రీ సేవలు దేశానికి ఆదర్శమన్నారు.



డాక్టర్ సుధాకర్‌రావును సన్మానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, తంగెళ్లపల్లి మల్లికార్జున్ చారి, కొమ్మాల శ్రీనివాస్, కేశబోయిన కుమారస్వామి, బొల్లు ఊషయ్య, కూకట్ల వీరన్న, మద్దెల శ్రీనివాస్, బొల్లు గణేష్, శుభాష్ పాల్గొన్నారు.

మూడోసారి అధికారం ఖాయం

తొర్రూరు: మూడో పర్యాయం బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి తొర్రూరుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌కు సోమవారం రాత్రి డివిజన్ కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మానుకోట టికెట్ నాకే..

- అనవసర ప్రచారాలు మానుకోవాలి
- కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ మానుకోట అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ తనకే వస్తుందని, తాను నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నానని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మానుకోట టికెట్ తనకే వస్తుందని, భారీ మెజార్టీతో గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. తాను అమ్ముడుపోయానని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, తాను అమ్ముడుపోయినట్లు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దళిత, గిరిజనులు ఆత్మగౌరవంతో బతుకుతారన్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో దళితులు, గిరిజనులకు రూ.12లక్షల ఆర్థిక సాయం అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలంతా ఆలోచించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయడంతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేస్తామన్నారు. సమావేశంలో ఎడ్ల యాదవరెడ్డి, బానోత్ ప్రసాద్, హెచ్.వెంకటేశ్వర్లు, భట్టు దేవ్ సింగ్, అంబాల శివకుమార్, గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ భూక్య శ్రీను, బైరు అశోక్ గౌడ్, నర్సింగ శ్రీనివాస్, రాంశెట్టి వీరేందర్, ఎండీ సలీం, విజయ, అరుణ్ నాయక్, రాందాస్, సామ మధుసూదన్ రెడ్డి, రాంకుమార్, భరత్, రాకేష్, సురేష్ ఉన్నారు.



ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పత్రం విడుదల చేస్తున్న మాజీ మంత్రి బలరాం నాయక్, తదితరులు

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం



కోర్టులో పోలీసులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి సరిత

తొర్రూరు: లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సరిత అన్నారు. సెప్టెంబర్ 9న తొర్రూరులో నిర్వహించే లోక్ అదాలత్‌పై సోమవారం డివిజన్ కేంద్రంలోని సివిల్ కోర్టులో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో రాజీకి వీలైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, మోటారు వాహన చట్టం కింద నమోదైన, ప్రిలిటిగేషన్ కేసులను ఇరు వర్గాల సమక్షంలో సమన్వయ పద్ధతిలో రాజీ కుదిర్చి పరిష్కరిస్తామని తెలిపారు. పోలీసులు ప్రజలకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఢీ కొట్టేదెవరు?

బీఆర్ఎస్‌కు దీటైన అభ్యర్థుల వేటలో కాంగ్రెస్, బీజేపీ

- ప్రచారంలో గులాబీదళం ఇంకా తేల్చని ఈరెండు పార్టీలు
- సీడబ్ల్యూసీకి చేరిన హస్తం అభ్యర్థుల దరఖాస్తులు
- సెప్టెంబర్ 17 తర్వాత కమలం అభ్యర్థుల జాబితా
- గెలుపు గుర్రాల ఎంపికపై రెండు పార్టీల దృష్టి
- మూడు పార్టీల్లో వేడెక్కిన రాజకీయాలు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో జనగామ మినహా 11 నియోజకవర్గాలకు బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులు ప్రచార బరిలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఢీకొట్టగల అభ్యర్థులను బరిలోకి దింపే దిశగా కాంగ్రెస్, బీజేపీలు కసరత్తు చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కోసం అధిష్టానం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25న ముగిసింది. ఆదరఖాస్తులు టీపీసీసీ నుంచి సీడబ్ల్యూసీ, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీలకు చేరాయి. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన పేరిట బీజేపీ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తోంది. కేంద్ర మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. అయితే ఇప్పటికే బీఆర్ఎస్ 11 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. ఇదే సమయంలో ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. ఎత్తులు, పైఎత్తులు.. పోటాపోటీ కార్యక్రమాలతో మూడు పార్టీల్లో రాజకీయాలు వేడెక్కాయి.

తొలి జాబితాలో చోటెవ్వరికీ.. కాంగ్రెస్ ఆశావహుల్లో ఉత్కంఠ

కాంగ్రెస్ అధిష్టానం దూకుడు చూస్తే ఈనెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈప్రక్రియలో భాగంగానే ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల నుంచి ఈనెల 18 నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ములుగు, భూపాలపల్లి మినహా అన్ని నియోజకవర్గాల నుంచి ఆశావహులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. ములుగు సిట్టింగ్ ఎమ్మెల్యే ధనసరి సీతక్క (అనసూయ), భూపాలపల్లి గండ్ర సత్యనారాయణకు ఖరారు కాగా.. నర్సంపేటకు దొంతి మాధవరెడ్డి ఫైనల్ అంటున్నారు. మిగతా చోట్ల ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్న చోట ముగ్గురి పేర్లను పరిశీలనలోకి తీసుకోనున్నారనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో సాగుతోంది. వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణ, డాక్టర్ కత్తి వెంకటస్వామిగౌడ్, వరంగల్ పశ్చిమకు నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవ రెడ్డి, కట్ల శ్రీనివాస్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య మధ్య నువ్వా నేనా? అనే రీతిలో ఉంది. పాలకుర్తి నుంచి దాదాపుగా అనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ఖాయమంటున్నా... బండి సుధాకర్, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. పరకాలలో ఇనుగాల వెంకట్రావిరెడ్డి, కొండా మురళిలో ఒకరికి.. మహబూబాబాద్ నుంచి పోరిక బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, డాక్టర్ మురళి నాయక్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చంటున్నా రు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు దొమ్మాటి సాంబయ్య, శనిగరం ఇందిర, డాక్టర్ బి.కృష్ణ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు పార్టీవర్గాల సమాచారం. డోర్నకల్ నుంచి జాటోత్ రాంచంద్రు నాయక్, మాలోత్ నెహ్రూ నా యక్, నూనావత్ భూపాల్ నాయక్, వర్ధన్నపేటకు నమిండ్ల శ్రీనివాస్, కేఆర్.నాగరాజు, బక్క జడ్సన్, సిరిసిల్ల రాజయ్య పేర్లపై చర్చ జరుగుతోంది.

సెప్టెంబర్ 17 తర్వాత కమల దళం

గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ నాయకులు సీట్ల కోసం పోటీ పడుతున్నారు. రాజకీయాలకు అంటీముట్టనట్లున్న డాక్టర్లు, కాంట్రాక్టర్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆపార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. అయితే బీజేపీ అధిష్టానం మాత్రం సెప్టెంబర్ 17 తర్వాతే అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటన ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో ఆశావహ నేతలంతా హైదరాబాద్, ఢిల్లీ నేతలతో టచ్‌లోకి వెళ్లి లాబీయింగ్ చేస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లిలో ఆ పార్టీకి బలం ఉంది. 2018 ఎన్నికల్లో ఈనియోజకవర్గాల్లో ఆపార్టీ అభ్యర్థులు ఓటమి పాలైనా ఓట్లు రాబట్టుకున్నారు. ఇప్పుడు ఆ స్థానాల నుంచి అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు చాలా మంది పోటీ పడుతున్నారు. 12 నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను పెట్టనున్న బీజేపీ అధిష్టానం దీటైన వ్యక్తుల కోసం ఆరా తీస్తుండగా.. ఎన్నికల సమయం సమీపిస్తున్నా కొద్దీ బీజేపీలో టికెట్ల పోరు ముదురుతోంది. వరంగల్ తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ, వరంగల్ పశ్చిమకు మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, రావు పద్మ పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి డాక్టర్ జి.విజయరామారావు, మహబూబాబాద్ నుంచి జాటోత్ హుస్సేన్‌నాయక్, భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి, నర్సంపేట, వర్ధన్నపేట నుంచి మాజీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కొండేటి శ్రీధర్ పేర్లున్నాయి. జనగామకు ఆరుట్ల దశమంతరెడ్డి, ముక్కెర తిరుపతిరెడ్డి, బేజాడి బీరప్ప, ప్రేమలతారెడ్డి, ములుగు నుంచి అజ్మీరా కృష్ణవేణి నాయక్, భూక్యా రాజునాయక్, తాటి కృష్ణ, భూక్యా జవహర్‌లాల్ టికెట్ ఆశిస్తున్నారు. పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పేర్లుండగా.. 27న పార్టీలో చేరిన డాక్టర్ కాళీప్రసాద్ పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నట్లు పార్టీవర్గాల సమాచారం.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు సన్మానం



వరంగల్ క్రైం : తన ఆటోలో మరచిన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును నిజాయితీగా బాధిత మహిళకు అప్పగించిన డ్రైవర్ ఫయిముద్దీన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం సన్మానించి నగదు రివార్డును అందజేశారు. రెండు రోజుల క్రితం కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఓ మహిళ బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును దిగే క్రమంలో ఆటోలో మరిచింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదుగా చేయగా వారు ఆటో డ్రైవర్లకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో మహిళ దిగిపోయిన కొద్దిసేపటికి సదురు బ్యాగును తన ఆటోలో గుర్తించిన డ్రైవర్ ఫయిముద్దీన్.. వెంటనే పోలీసులతో పాటు ఆటో యూనియన్ సభ్యులకు సమాచారం ఇచ్చి అందజేశారు. దీంతో ఆటోడ్రైవర్ నిజాయితీని మెచ్చి కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రంగనాథ్.. ఫయిముద్దీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, వరంగల్ ట్రాఫిక్ సీఐ వెంకన్న పాల్గొన్నారు.

మేడారం హుండీల లెక్కింపు



ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మల హుండీలను సోమవారం స్థానిక ఎండోమెంట్ కార్యాలయంలోని డార్మెంటరీ భవనంలో లెక్కించారు. పూజారుల సమక్షంలో ఈఓ రాజేందర్ పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కించారు. ఇందులో సమ్మక్క హుండీ ఆదాయం రూ.26,27, 054, సారలమ్మ హుండీ 24,77,477, పగిడిద్దరాజు హుండీ 94,540, గోవిందరాజు హుండీ ఆదాయం 99,106 రాగా మొత్తం 52,98,177 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. భక్తులు.. తల్లులకు కరెన్సీ నోట్లు, వెండి, బంగారు ఆభరణాలు సమర్పించినట్లు తెలిపారు. లెక్కింపు వద్ద ఎస్సై ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఎండోమెంట్ సూపరిండెంటెంట్ క్రాంతికుమార్, పూజారులు మునీందర్, సారయ్య, చంద రఘుపతి, కిరణ్, పగిడిద్ద రాజు, గోవింద రాజు పూజారులు పాల్గొన్నారు.



థాయిలాండ్‌లో.. ‘సహకారం’లోనే మార్కెటింగ్

పంట ఉత్పత్తులకు విలువ జోడింపుతో అధిక ఆదాయం

- కంపెనీని తలపిస్తున్న వ్యవసాయ క్షేత్రం
- రైతుబంధు, రైతుబీమాపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన థాయిలాండ్ దేశస్తులు
- ‘సాక్షి’తో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సాక్షితో మాట్లాడుతున్న వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని



థాయిలాండ్‌లో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మార్నేని రవీందర్‌రావు

హన్మకొండ : థాయిలాండ్ దేశంలో సహకార రంగంలోనే వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ కొనసాగుతోందని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. సహకార రంగంలో స్థిరమైన ఫైనాన్సింగ్ వ్యూహాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు అంశంపై థాయిలాండ్‌కు స్టడీ టూర్‌కు వెళ్లి వచ్చిన మార్నేని సోమవారం ‘సాక్షి’తో అక్కడి విశేషాలు పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. మన దేశంలో వ్యవసాయ మార్కెటింగ్ ప్రత్యేక వ్యవస్థగా కొనసాగుతుంటే థాయిలాండ్‌లో సహకార రంగంలోనే కొనసాగుతుంది. మన దేశంలో చిన్నచిన్న కమతాల్లో వ్యవసాయం చేస్తుంటే థాయిలాండ్‌లో కమతాలు చాలా విశాలంగా ఉంటాయి. ఒక్కో వ్యవసాయ క్షేత్రం 30 నుంచి 50 ఎకరాల వరకు ఉంటుంది. కుటుంబం మొత్తం వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. ఆ దేశంలో పంట ఉత్పత్తులకు విలువ జోడింపు చేస్తారు. దీంతో రైతులకు అధిక ఆదాయం వస్తుంది.

అధ్యయనానికి వస్తామన్నారు..

తెలంగాణలో రైతుబంధు, రైతు బీమా గురించి చెప్పితే ఇలా కూడా ఉంటుందా అని థాయిలాండ్ దేశస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయం విన్న వారు తెలంగాణకు వచ్చి అధ్యయనం చేస్తామని చెప్పారు. సహకార వ్యవస్థలో నూతన విధానాలు తీసుకురావడానికి ఈ స్టడీ టూర్‌కు వెళ్లాం. 22వ తేదీన బ్యాంకాక్‌లోని హోటల్ సెంట్రో వాటర్‌గేట్‌లో సమావేశమై వివిధ సహకార సంఘాల పనితీరు.. వ్యవస్థ విధి విధానాలపై చర్చించాం. రెండో రోజు బ్యాంకాక్‌లోని సహకార శాఖ కార్యాలయాలు, వాటి పనితీరును అధ్యయనం చేశాం. మూడోరోజు బోతాంగ్ జిల్లా థాట్‌తంగ్‌లో గల పంటలను పరిశీలించాం.

వరితోపాటు పండ్లు, కూరగాయలు

వరితో పాటు, పండ్లు, కూరగాయల పంటలు సాగు చేస్తారు. పండ్లు, కూరగాయల సాగు పాలీ హౌజ్‌ల్లోనే చేస్తారు. పంట ఉత్పత్తులను రైతులే ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తారు. ప్రతి వ్యవసాయ క్షేత్రం కంపెనీని తలపిస్తుంది. భారత్‌లో 80 శాతం ఆధారపడితే థాయిలాండ్‌లో 20 నుంచి 30 శాతం వరకు మాత్రమే వ్యవసాయంపై ఆధారపడుతారు. అక్కడ సాగునీటి వనరులు తక్కువ. మార్కెటింగ్ మన దగ్గర అంత సానుకూలంగా ఉండదు. అదే థాయిలాండ్‌లో సులువుగా ఉంటుంది. థాయిలాండ్ ప్రధానంగా పర్యాటక ప్రాంతంగా ప్రఖ్యాతి గాంచింది. మన దేశంలోనే కేంద్ర సహకారం పెరిగితే సహకార రంగం పురోభివృద్ధి సాధిస్తుంది.

ములుగుపై బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి రావాలి
- మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు: ములుగు గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్స్‌లో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలిసి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులవి తుపాకీ రాముడి మాటలన్నారు. ప్రజలు అవి నమ్మి మోసపోవద్దన్నారు. పేదల కోసం ప్రాణాలర్పించిన బడే నాగజ్యోతి కుటుంబానికి అండగా ఉండాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్.. బోగస్ పార్టీ అని అభివర్ణించారు. బడే నాగజ్యోతి అభ్యర్థిత్వానికి కట్టుబడి ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ తరుఫున టికెట్ ఆశించి రాని వారందరూ అధైర్య పడొద్దని, అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ములుగు ప్రజలు, కార్యకర్తల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. తెలంగాణలో పోడు రైతులకు పట్టాలు అందించి రైతుబంధు అందజేస్తున్న గొప్ప నేత సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.. మూడు గంటల కరెంట్ ఇస్తానని చెప్పి రైతుల మనోభావాలను దెబ్బతీశారని, సీఎం కేసీఆర్ ఆరునూరైనా 24 గంటల కరెంట్ ఇస్తానని హామీ ఇస్తున్నారన్నారు. మనకు మూడు గంటల కరెంట్ కావాలా.. 24 గంటల కరెంట్ కావాలా కార్యకర్తలను అడిగారు. రాష్ట్రంలో అతి సునాయాసంగా గెలిచే మొదటి అసెంబ్లీ స్థానం ములుగు అన్నారు. బడే నాగజ్యోతి 30 వేలపై చిలుకు ఓట్లతో గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డ నాగజ్యోతికి ప్రజల ఆశీస్సులు ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే భవిష్యత్‌లో ములుగును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ కవిత మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త నాగజ్యోతి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, కాకులమర్రి లక్ష్మణ్, పోమానాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

- దొంగ అరెస్ట్
- రూ.10.09 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను సీసీఎస్, హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రూ.10.09 లక్షల విలువైన 163 గ్రాముల బంగారం, 180 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. క్రైం ఏసీపీ మల్లయ్య కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన సన్నిధి ఆంజనేయులు చిన్నప్పటి నుంచే చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి పలుమార్లు జువైనల్ హోంకు వెళ్లాడు. కొద్ది రోజుల అనంతరం మరోమారు మిర్యాలగూడ, ఖమ్మం, హుజూర్‌నగర్, గద్వాల పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడడంతో పోలీసులు అరెస్ట్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మరోసారి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. దీనిపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టి దొంగను గుర్తించారు. చోరీ సొత్తును విక్రయించేందుకు సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ పరిసరాల్లో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో దొంగను పట్టుకున్నారు. అనంతరం విచారించగా దొంగ తన నేరం అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

క్రీడా హబ్‌గా ఓరుగల్లు ..

- సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలను విజయవంతం చేద్దాం
- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్: చారిత్రక ఓరుగల్లు నగరం ఇప్పటికే ఐటీ, విద్య, మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుందని, త్వరలోనే స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు 33వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరుగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చారిత్రక ఓరుగల్లు నగరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ అందించేందుకు అన్ని వసతులు అందుబాటులో తీసుకొస్తామన్నారు. అనంతరం అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ అండర్ -14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు మూడు రోజులు జరగనున్న పోటీలకు 8 రాష్ట్రాల నుంచి 1100 మంది క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ‘కుడా’ చైర్మన్ సుందర్‌రాజ్, ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ అనిల్, ఒలింపిక్ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్ ఖాన్, కైలాస్‌యాదవ్, అథ్లెటిక్స్ సంఘం వరంగల్ జిల్లా చైర్మన్ మూగుల కుమార్‌యాదవ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పురాతన యుద్ధ కళలో ఒక్కటైన ఫెన్సింగ్ (కత్తియుద్ధ) అభివృద్ధికి, ఫెన్సింగ్ క్రీడాకారుల వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 29 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వరంగల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము, జన్ను భాస్కర్, డాక్టర్ పీవీ మల్లికార్జున్, నవీన్‌రెడ్డి, కూనూరు రాజశేఖర్, ఎం మధుచంద్రయాదవ్, మురళీమోహన్, కె పరమేశ్వ రాచారి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలు ఏం అడగొద్దు..

‘సుమారు రూ. 7 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జేఎన్ఎస్‌లో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ పనులు పూర్తయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు ఎందుకు అప్పగించలేదు.. ‘కుడా’ నిధులతో ట్రాక్ మధ్యలో గార్డెనింగ్ ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఎందుకు చేపట్టలేదు.. క్రీడా క్యాలెండర్ రూపకల్పన ఏమైందని’ విలేకరులు అడిగిన ప్రశ్నలకు చీఫ్‌విప్ వింత సమాధానం ఇచ్చారు. ఈ మూడు నెలలు ఏం అడగొద్దు, సహకరించండి, సమయం లేదు అంటూ వెళ్లిపోవడంతో అక్కడే ఉన్న క్రీడాసంఘాలు, సీనియర్ క్రీడాకారులు విస్తుపోయారు.

పార్సిల్ స్టోర్‌లో చోరీ


- రూ.3.50 లక్షలు అపహరణ
- సీసీ ఫుటేజీ డీవీఆర్ కూడా..
- జనగామలో ఘటన



స్టోర్ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

జనగామ: జిల్లా కేంద్రంలోని ఇన్‌స్టాకార్ట్ పార్సిల్ స్టోర్ (ఆన్‌లైన్ పార్సిల్ సప్లై)లో చోరీ జరిగింది. ఈ ఘటన సోమవారం వెలుగు చూసింది. స్టోర్ ఇన్‌చార్జి వంశీ, పోలీసుల కథనం ప్రకారం రోజువారీగా వచ్చే ఆన్‌లైన్ పార్సిల్ లెక్క సరి చూసుకుని సిబ్బంది ఆదివారం రాత్రి స్టోర్ మూసివేశారు. ఈ క్రమంలో దుండగులు స్టోర్ ఎమర్జెన్సీ అలారం కరెంట్ వైర్ కట్ చేసి తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. అనంతరం లాకర్‌లో ఉన్న రూ.3.50 లక్షలు ఎత్తుకెళ్లారు. అలాగే, సీసీ ఫుటేజీ జంక్షన్ బాక్స్ కనెక్షన్ తొలగించారు. లాకర్‌తో పాటు సీసీ ఫుటేజీ డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌తో కలిసి ఆధారాలు సేకరించారు. అనంతరం స్టోర్‌లో పని చేసే ప్రతి ఒక్కరినీ విచారించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



కోమల్‌రెడ్డి(ఫైల్)

నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పనికరలో జరిగింది. గ్రామానికి చెందిన గర్నేపల్లి కోమల్‌రెడ్డి (48) తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్లుగా పంట సరిగా చేతికి రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన.. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన భార్య విజయ, తండ్రి నర్సింహారెడ్డి హుటాహుటినా నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి కోమల్‌రెడ్డి అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ జానీపాషా తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తగా గర్వపడుతున్నా..

- డాక్టర్ గంజి వెంకటనారాయణ



సీనియర్ శాస్త్రవేత్త వెంకటనారాయణను సన్మానిస్తున్న గార్ల హైస్కూల్ ఉపాధ్యాయులు

గార్ల: ఇస్రో శాస్త్రవేత్త అయినందుకు గర్వపడుతున్నానని గార్ల వాసి, చంద్రయాన్-3లో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటనారాయణ అన్నారు. గార్ల హైస్కూల్లో 10వ తరగతి వరకు చదువుకున్న ఆయనను సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3.. 38 రోజుల ప్రయాణాన్ని విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక శాస్త్రవేత్త అయితే సమాజంలో ఎంత గౌరవం దక్కుతుందో ఈ రోజు తాను కళ్లారా చూసానని, తనలా కష్టపడి చదువుకుని ఇస్రో శాస్త్రవేత్తలై చంద్రమండలం మీదికి వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. అలాగే, తాను చంద్రయాన్-3 రాకెట్ లాంచింగ్‌కు కావాల్సిన మెటీరియల్ విభాగంలో ప్రముఖ వ్యక్తిగా ఉన్నానని తెలిపారు. ఈ ప్రయోగ లక్ష్యం చంద్రుడి దక్షిణార్థ గోళంలో విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజాన్ని కనుగొనడమన్నారు. 10 కేజీల హీలియం ఖనిజాన్ని పొందగలిగితే సంవత్సరానికి సరిపడ విద్యుత్‌ను రాష్ట్రానికి అందిచొచ్చని పేర్కొన్నారు. అనంతరం గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు సన్మానించారు. పాఠశాల హెచ్ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ కుమార్‌గౌడ్, ఈశ్వర్‌లింగం, అప్పయ్య, ఉపాధ్యాయులు రమేష్, రమణ, రాము, పద్మావతి, కవిత, సరోజిని, ఫయాజ్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు..

- నిందితులకు పదేళ్ల జైలు



మృతురాలి అత్త, మామ, భర్త

నెల్లికుదురు: వరకట్న వేధింపుల కేసులో అత్తామామ, భర్తకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు జడ్జి చంద్రశేఖర ప్రసాద్ సోమవారం తీర్పు ఇచ్చారు. తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు కథనం ప్రకారం నెల్లికుదురు మండలం అలేరుకు చెందిన గుడిసందు సమత కూతురు పూజను కురవి మండలం నేరడకు చెందిన రుద్రారపు సత్యం, శిరేఖ దంపతుల కుమారుడు నరేష్‌కు ఇచ్చి 2018లో వివాహం జరిపించారు. ఆ సమయంలో కట్నకానుకలు, బంగారం అప్పగించారు. వివాహమైన సంవత్సరం వరకు బాగానే చూసుకున్న భర్త, అత్త, మామ.. అనంతరం మిగతా కట్నం తీసుకురమ్మని వేధించసాగారు. దీనిపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా వేధింపులు తగ్గకపోవడంతో పూజ 2020లో ఉరివేసుకుని మృతి చెందింది. దీనిపై మృతురాలు తల్లి సమత ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఫణిదర్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ ఎం.వెంకటరమణ విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పూజ మృతిపై సాక్షులను విచారించి అత్తామామ, భర్తకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టులో జడ్జి పి.చంద్రశేఖర ప్రసాద్ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

వాగులో మునిగి వ్యక్తి మృతి

మరిపెడ రూరల్: దశదిన కర్మకు హాజరైన ఓ వ్యక్తి.. వాగులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తాళ్లఊకల్ శివారు పాలేరు వాగులో జరిగింది. గ్రామానికి చెందిన కారింగుల వీరన్న (55) సోమవారం ఇదే గ్రామానికి చెందిన తన సమీప బంధువు దశదిన కర్మకు హాజరయ్యాడు. బంధువులతో కలిసి వాగులో స్నానం చేయడానికి వెళ్లి మునిగాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన బంధువులు.. వాగులో గాలించగా వీరన్న మృతి చెంది కనిపించాడు. వాగులో తలకు రాళ్లు తగలడంతో వీరన్న మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి బలి..

- హైదరాబాద్‌లో రోడ్డు ఊడుస్తుండగా బస్సు ఢీ..
- చికిత్స పొందుతూ మహిళ మృతి



సునీత (ఫైల్)



కొమురమ్మ మృతదేహం

లింగాలఘణపురం : భర్త దివ్యాంగుడు.. ఏ పని చేయలేని పరిస్థితి. పైగా సొంత ఊరిలో ఉపాధి కరువు.. దీంతో బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకుని హైదరాబాద్ వెళ్లిన ఓ మహిళను మృత్యువు బలితీసుకుంది. విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాద రూపంలో కబలించింది. దీంతో తీవ్రగాయాలపాలైన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన తిప్పారపు సునీత (41), గోవర్ధన్ దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సునీత కుటుంబం బతుకుదెరువు కోసం పదిహేనేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లింది. సునీత ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తోంది. సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ పీఎస్ పరిధిలో రామ్‌కోటి పిస్తా హౌజ్ ఎదుట రోడ్డు ఊడుస్తోంది. ఈ క్రమంలో ఓ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. దీంతో స్థానికులు క్షతగాత్రురాలిని వెంటనే ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డ్రైవర్ బస్సు నిర్లక్ష్యంగా నడపడంతో సునీత మృతి చెందగా.. కుటుంబం దిక్కులేనిదైంది. కాగా, ఇద్దరు కూతుళ్లు, భర్త సునీత మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

పింఛన్ కోసం వెళ్తూ అనంతలోకాలకు...

కేసముద్రం: గ్రామంలో పోస్టాఫీస్ లేకపోవడంతో పక్క గ్రామంలో వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్టి కొమురమ్మ(80) వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు పక్కగ్రామమైన గూడూరు మండలం తీగలవేణి గ్రామంలోని పోస్టాఫీస్‌కు ఓ వ్యక్తి బైక్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కింది. కొంతదూరం వెళ్లగా ప్రమాదవశాత్తు ఆమె బైక్‌పై నుంచి కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అర్పనపల్లి గ్రామంలో పోస్టాఫీస్ లేకపోవడం మూలంగా వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం పక్క గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27212]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27215]

HOUSE FOR SALE/RENT

■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

FARM PLOTS FOR SALE

■ఆనందవనం ఫేస్ 7 నందు ఫామ్ ల్యాండు కొలన్‌పాక, యాదాద్రి నందు ఫామ్ ల్యాండు ఆఫర్ 5+1 ప్లాట్ నందు 5 తీసుకొన్న 1 ప్లాట్ ఫ్రీ Plot Rate 4999/-. సంప్ర॥ 9014743326. [W-189141]

SERVICES

BUSINESS OFFER

■Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

■ కిరాణం ప్రాడక్ట్స్ బిజినెస్ కోసం 2 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేయగలవారు సంప్రదించండి. ప్రతి వారం 14 వేలు ఆదాయం. 6 నెలల వరకు అగ్రిమెంట్. జనగాం-81439 09459. [M-1221533]

■ శ్రీరామ్ గోల్డ్: మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టు లో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9133214214. [H-788623]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-189133]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ హన్మకొండలో పనిచేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. సొంత టూ వీలర్ ఉండవలెను. జెన్యూన్ పర్సన్స్ మాత్రమే సంప్రదించండి. షరతులు వర్తిస్తాయి. సెల్: 7901323399. [W-189156]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000-16000. సెల్: 9703637320 [W-189147]

■ WGL, మండిబజార్ Exclusive డ్రైఫ్రూట్ షాప్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సాలరీ: 10000-12000. సెల్: 9177395934. [WA-602]

WANTED TEACHERS

■ Wanted Hindi and supporting Lady Teachers for 1st to 5th Classes Indian Kids High School, SVN Road, Warangal. Cont No: 9963006221. [W-189143]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.